జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 112 | సోమవారం 15 సెప్టెంబరు – 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## 15 రోజులపాటు ప్రధాని మోడి పుట్టినరోజు వేడుకలు – రోజుకొక బహుమతి



న్యూఢిల్లీ సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్) : ప్రధాని నరేంద్ర మోడీ 75 వ పుట్టిన రోజు వేడుకలకు ఢిల్లీ ప్రభుత్వం భారీ ఎత్తున సన్నాహాలు చేస్తోంది. సెప్టెంబర్ 17వ తేదీన ప్రధాని మోడీ పుట్టినరోజు నుండి రాజధానిలో 15 రోజులపాటు పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్నాయి. త్యాగరాజు స్టేడియంలో జరిగే కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా 15 కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, మౌలిక సదుపాయాలు తదితర అభివఅద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, ఇతర మంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవాలు ప్రధాని మోడీ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన సన్నాహాలను సమీక్షించారు. వేడుకలలో ఢిల్లీ పౌరులకు ప్రతిరోజూ కొత్త బహుమతిని అందించనున్నామని ప్రకటించారు. ఇవి ఢిల్లీ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని, వీక్షిత్ ఢిల్లీ దార్శనికతను నెరవేర్చడంలో సహాయపడతాయని సీఎం రేఖా గుప్తా పేర్కొన్నారు. వీటిలో 101 ఆరోగ్య నిలయాలు, 150 డయాలసిస్ కేంద్రాలు, కొత్త హాస్పిటల్ బ్లాక్‌లు, అవయవ మార్పిడి, అవగాహన పోర్టల్ ప్రారంభం మొదలైనవి ఉండనున్నాయి.

మిగతా 2లో...

## రాష్ట్ర అభివృద్ధిలో ఇంజనీర్స్ భాగస్వాములు కావాలి..







హైదరాబాద్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): తమ మేధోశక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డే సందర్భంగా.. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లరందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన (సోమవారం)సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డే జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విశ్వేశ్వరయ్య ఇంజినీరుగా, దార్శనికుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి

మిగతా 2లో...

## హనీ ట్రాప్‌లో చిక్కుకున్న యోగా గురువు.. పోలీసుల ఎదుట లబోదిబో..



హైదరాబాద్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): యోగా గురువును ఒక గ్యాంగ్ పథకం ప్రకారం హనీ ట్రాప్ చేసింది. అనంతరం యోగా గురువును సదరు గ్యాంగ్ భారీగా నగదు డిమాండ్ చేసింది. దీంతో అతడు కొంత సొమ్మును ఆ గ్యాంగ్‌కు ముట్ట చెప్పాడు. అయినా సంతృప్తి చెందని ఆ గ్యాంగ్.. యోగా గురువును రూ.2కోట్లు డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆ యోగా గురువు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అందులో భాగంగా ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి.. స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో ఆ బాధితుడు యోగా గురువుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. అయితే తమకు అనారోగ్య సమస్యలు ఉన్నాయంటూ ఇద్దరు మహిళలు యోగా గురువును ఆశ్రయించారు. అలా ఆశ్రమంలో ఆశ్రయం పొందారు. అనంతరం యోగా గురువుతో సదరు మహిళలు అత్యంత సన్నిహితంగా మెలిగారు.

## నగరంలో జింక మాంసం కలకలం.. ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులు..




హైదరాబాద్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): నగరంలో జింక మాంసం కలకలం రేపింది. టోలిచౌకిలో జింక మాంసం అక్రమ రవాణాను అధికారులు బట్టబయలు చేశారు. పక్కా సమాచారం మేరకు మావిన్ క్లాసిక్ అపార్ట్‌మెంట్ వద్ద అధికారులు అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. సోదాల్లో 10 కిలోల జింక మాంసం, 3 జింక కొమ్ములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటితో పాటు బొలెరో వాహనం సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జింక మాంసం రవాణా చేస్తున్న మహమ్మద్ సలీం, మహమ్మద్ ఇక్బాల్ అనే ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాంసం, బొలెరో వాహనాన్ని అటవీ శాఖ అధికారులకి అప్పగించినట్లు పేర్కొన్నారు. నిందితులపై వన్యప్రాణి రక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు వివరించారు. నిందితులకు జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ వన్యప్రాణి రక్షణకు సహకరించాలని సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ విజ్ఞప్తి చేశారు.

## మేధా హైస్కూల్‌పై విద్యాశాఖ కీలక నిర్ణయం..

మేడ్చల్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): సికింద్రాబాద్ పరిధి బోయినపల్లిలో డ్రగ్స్ తయారీ కేంద్రంగా కొనసాగుతున్న మేధా హైస్కూల్‌పై విద్యాశాఖ ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. మేధా హైస్కూల్‌ను విద్యాశాఖ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. బాలానగర్ మండల విద్యాశాఖ అధికారి హరీశ్ చంద్ర ఆదేశాలతో.. ఈ హైస్కూల్‌ను సీజ్ చేశారు. అంతేకాకుండా స్కూల్‌కు సంబంధించిన అన్ని అనుమతులను విద్యాశాఖ రద్దు చేసింది. ఈ మేధా హైస్కూల్‌ను సోమవారం నాడు విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలించనున్నారు. అనంతరం ఈ హైస్కూల్‌ను శాశ్వతంగా మూసి వేయనున్నారు. ఈ స్కూల్‌లో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారిని ఇతర స్కూళ్లలో జాయిన్ చేసేందుకు విద్యా శాఖ అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సికింద్రాబాద్ పరిధి ఓల్డ్ బోయినపల్లిలోని మేధా హైస్కూల్‌పై రెండ్రోజుల క్రితం ఈగల్ టీమ్ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా స్కూల్ వేదికగా భారీ ఎత్తున డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించింది. అందుకు సంబంధించి హైస్కూల్ ప్రిన్సిపల్‌తోపాటు పలువురిని అరెస్ట్ చేశారు. విద్యార్థుల తరగతి గదుల పక్కనే.. ఎవరికీ అనుమానం రాకుండా ఈ డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. అందుకు సంబంధించి లక్షలాది రూపాయిల విలువైన డ్రగ్స్‌ను ఈ సందర్భంగా ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది.

## మేడారంలో సీతక్క పర్యటన.. ప్రతిపక్షాలకు స్ట్రాంగ్ కౌంటర్...




ములుగు: సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): మేడారం మహాజాతర నేపథ్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ మేరకు ఆమె మేడారంలో పర్యటించారు. స్థానిక ఎస్పీ శబరీష్‌తో బైక్‌పై తిరుగుతూ పనులను పర్యవేక్షించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## గ్రూప్–1పై కేటీఆర్ వ్యాఖ్యలు.. ఎంపీ చామల స్ట్రాంగ్ కౌంటర్..




హైదరాబాద్: సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): గ్రూప్–1 పరీక్షలపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఖండించారు. గ్రూప్–1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కేటీఆర్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పరీక్షల్లో 563 అభ్యర్థుల దగ్గర రూ.3కోట్ల లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్లను ఎంపిక చేసిందని

## నగర జీవికి వార్నింగ్




హైదరాబాద్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): హైదరాబాద్ నగర ప్రజలను పలు సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయి. వాటిలో ట్రాఫిక్, కాలుష్యం, భారీ వర్షం కురిస్తే.. రహదారులు భారీ చెరువులను తలపిస్తున్నాయి. ఇవే కాకుండా చెత్త సమస్య సైతం నగర జీవులను ప్రధానంగా ఇబ్బంది పెడుతోంది. ఈ చెత్త సమస్య నగరంలోని గల్లీల్లోనే కాకుండా.. ప్రధాన ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ తదితర ప్రాంతాల్లోని ప్రజలను కూడా కలవరపాటుకు గురి చేస్తోంది.

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వర్షం..




హైదరాబాద్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, ముషీరాబాద్, తార్నాక, లక్డీకాపూల్, కాచిగూడ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. ఆదివారం మధ్యాహ్నం కాస్తా ఎండగానే ఉన్నా.. సాయంత్రం మాత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇక ఈ వర్షం కారణంగా... రహదారులు .జలమయం అయ్యాయి. ప్రధాన రహదారుల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

మిగతా 2లో...

# కడ్పల్ గ్రామం నుండి పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లోకి చేరిక




సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 14: సిర్గాపూర్ మండలంలోని కడ్పల్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్, ఇతర ప్రముఖ నాయకులు కలిపి సుమారు 50 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యక్రమం నిర్వహించబడింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై మహారెడ్డి భూపాల్ రెడ్డి చేస్తున్న పోరాటానికి ఆకర్షితులై, కాంగ్రెస్‌ను వీడి గులాబీ జెండాకిందకి చేరిన వారిలో ః

తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ రెడ్డి, %ూూజూ% చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రిటైర్డ్ %=×% నారాయణ మరియు వారి అనుచరులు, కార్యకర్తలు ఉన్నారు. వారందరికి మహారెడ్డి భూపాల్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర ముఖ్య నేతలు:

మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ్ రావు పాటిల్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు బషీర్, మాజీ సర్పంచులు సాయిగౌడ్, భూమ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, నాయకులు హనుమంత్ రెడ్డి, సంగమేశ్వర్, అమన్ సాబ్, రాజామల్లు, మోహన్ రెడ్డి, నాగభూషణం, నాగరాజు, సత్యనారాయణ గౌడ్, కృష్ణ రెడ్డి, ఉపరి మోహన్, అంజా గౌడ్, రాములు, ప్రశాంత్ సాగర్, మహేంద్ రెడ్డి, గురునాథ్ తదితరులుపాల్గొన్నారు

# కోదాడలో బహిరంగ మలవిసర్జన – సమాజాన్ని కుదిపేస్తున్న అలవాటు

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో తరచూ కనిపించే ఒక బాధాకర దృశ్యం సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. చిన్నా పెద్దా, మహిళలు కూడా వెళ్ళే రహదారుల పక్కనే కొంతమంది పురుషులు ఎలాంటి సిగ్గు లేకుండా బహిరంగంగా మలవిసర్జన, మూత్రవిసర్జన చేస్తూ కనిపిస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన వారు అసహనంతో ప్రశ్నిస్తే, "నీకు ఏమి అవసరం?" అని వాదించుకుంటూ తప్పు చేసిన వారు తామే సరిగా ఉన్నట్లు ప్రవర్తిస్తున్నారు.అయితే, ఇలాంటి సందర్భాల్లో అక్కడ గమనించే మహిళలు "ఛీ" అనుకుంటూ, మాటల్లో చెప్పలేక నిశ్శబ్దంగా ఆ స్థలాన్ని వదిలి వెళ్ళిపోతున్నారు. వీధుల్లో నిత్యం ఎదురయ్యే ఈ పరిస్థితి మహిళలకు మాత్రమే కాదు, పిల్లలకు కూడా అవమానకరమైనది.

సమాజానికి కలిగే ప్రభావం

1. మహిళల భద్రతా సమస్యలు – ఇలాంటి సందర్భాలు మహిళలకు మానసిక ఒత్తిడి కలిగిస్తున్నాయి. సిగ్గుతో చెప్పలేని ఈ సమస్య రోజువారీ జీవితాన్ని అసౌకర్యానికి గురిచేస్తోంది.

2. ఆరోగ్య సమస్యలు – బహిరంగ మలవిసర్జన వల్ల కాలుష్యం పెరిగి రోగాలు వ్యాపించే ప్రమాదం అధికం.

3. సాంస్కృతిక వెనుకబాటుతనం – మనం అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పుకుంటూనే ఇలాంటి అలవాట్లు కొనసాగడం సమాజానికి చేటు.

ఎవరు మారాలి? ఎలా మారాలి?


వ్యక్తిగత బాధ్యత: ప్రతి వ్యక్తి తన అలవాటును మార్చుకోవాలి. "ఇది పెద్ద విషయం కాదు" అనే నిర్లక్ష్య భావన వదిలేయాలి.

ప్రభుత్వం మున్సిపాలిటీ చర్యలు: పట్టణంలో మరిన్ని ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ పట్ల కఠినంగా ఉండాలి.సమాజ జాగృతి: పాఠశాలల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికి పరిశుభ్రత, మర్యాద పై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలి.చట్టపరమైన చర్యలు: బహిరంగంగా మలవిసర్జన చేసేవారిపై జరిమానాలు విధించడం తప్పనిసరి చేయాలి.

ముగింపు

ఇలాంటి సమస్యలు కేవలం కోదాడలోనే కాకుండా దేశవ్యాప్తంగా కనిపిస్తున్నాయి. అయితే, సమాజం మొత్తం ఒక సంకల్పంతో ముందుకు వస్తేనే మార్పు సాధ్యమవుతుంది. మహిళలు ప్రతిరోజూ ఎదుర్కొనే ఈ అవమానకర పరిస్థితిని తలదన్నేలా మనం కలిసికట్టుగా మార్పు తీసుకురావాలి.

# క్రీడలతో మనసిక కుల్లాసం - శారీరక ఆరోగ్యానికి బలం

సందేశం టైమ్స్, సెప్టెంబర్ 14 – సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కూన వేణు క్రీడల ప్రాముఖ్యతను ఉదహరించారు. "క్రీడలు మనసుకు కుల్లాసాన్ని ఇచ్చి, శరీరానికి ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఈ యుగంలో రోగాల నుండి దూరంగా ఉండాలంటే క్రీడలు తప్పనిసరి," అని ఆయన పేర్కొన్నారు. యువతను ఉత్సాహపరుస్తూ ఆయన మాట్లాడుతూ, "ఆరోగ్యం బాగుంటేనే అన్ని బాగుంటాయి. ప్రతి ఒక్కరు రోజువారీ జీవితంలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి. శారీరక దారుఢ్యం పెరిగితేనే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది" అని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన నాయకులు, స్థానిక ప్రముఖులు, క్రీడాప్రియులు పాల్గొన్నారు. సంఘటిత క్రీడలు యువతను ఒకటిగా చేర్చి సామాజిక స్ఫూర్తిని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పత్రికారిత్యం - ప్రజాస్వామ్యానికి ప్రాణం

## తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ గౌడ్




సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 14: ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంబంగా పరిగణించబడే పత్రికారంగం, సమాజానికి అద్దం పట్టే శక్తిగా నిలుస్తోంది. పత్రికా రంగం కేవలం వార్తలను చేరవేయడమే కాదు, నిజాన్ని వెలికితీయడం, ప్రజలలో చైతన్యం నింపడం, పాలక వర్గాలను జవాబుదారులుగా నిలపడం వంటి గొప్ప కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది.

**పత్రికా రంగం లక్ష్యం**

పత్రికారిత్య ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు నిజమైన, నిష్పాక్షికమైన, సమయానుకూలమైన సమాచారం అందించడం. వార్తల ద్వారా ప్రజలలో అవగాహన పెంపొందించి, వారిని సమాజ సమస్యలపై ఆలోచింపజేయడం. ముఖ్యంగా అణగారిన వర్గాలకు గొంతుకగా నిలిచి, వారి సమస్యలను వెలుగులోకి తేవడం జర్నలిస్టుల నిజమైన ధ్యేయం.

**పత్రికారిత్య మూల సూత్రాలు**

పత్రికా రంగం కొన్ని బలమైన సూత్రాలపై నిలబడింది.

నిష్పాక్షికత : వార్తల్లో వ్యక్తిగత వైఖరి లేకుండా న్యాయం చేయడం.

ఖచ్చితత్వం : వాస్తవాలను పరిశీలించి తప్పులేని సమాచారాన్ని అందించడం.

స్వతంత్రం : రాజకీయాలు, సంస్థలు లేదా వర్గాల ఒత్తిడికి లోనవకుండా స్వతంత్రంగా పనిచేయడం.పారదర్శకత : వనరులు, పద్ధతులు, ప్రయోజన సంఘర్షణల విషయంలో స్పష్టత చూపడం.జవాబుదారీతనం : తప్పులు జరిగితే అంగీకరించి సరిచేయడం.

**పత్రికారంగపు విభాగాలు**

పత్రికారంగం అనేక రూపాల్లో ఉంటుంది:

ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం – అవినీతి, అక్రమాలను లోతుగా పరిశీలించి బయటపెట్టడం.

బ్రాడ్‌కాస్ట్ జర్నలిజం – టెలివిజన్, రేడియో ద్వారా వార్తల ప్రసారం.ప్రింట్ జర్నలిజం – పత్రికలు, మాసపత్రికలు, ఆన్‌లైన్ పబ్లికేషన్లలో రాయడం.డిజిటల్ జర్నలిజం – సోషల్ మీడియా, వెబ్ ద్వారా వార్తలు.సిటిజన్ జర్నలిజం – ప్రజలే వార్తలను పంచుకునే విధానం.

**ప్రజాస్వామ్యంలో పాత్ర**

పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్యం పూర్తి కాదు. పత్రికలు, జర్నలిస్టులు లేకపోతే సమాజం అంధకారంలోనే మిగిలిపోతుంది. ఎందుకంటే పత్రికారంగమే ప్రజలకు కళ్లుగా, చెవులుగా, స్వరంగా ఉంటుంది.

**ముగింపు**

మొత్తం మీద పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి వాచ్‌డాగ్‌గా, ప్రజల గొంతుకగా, చైతన్య దీప్తిగా నిలుస్తుంది. జర్నలిస్టుల ప్రతి కలం గీత సమాజాన్ని మేల్కొలిపే శక్తిని కలిగి ఉంది.

# సుల్తాన్ చాంద్ పబ్లికేషన్స్ వారి సామాజిక సేవ అభినందనీయం



సందేశం టైమ్స్:సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సెప్టెంబర్ 14: సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి కి సుల్తాన్ చాంద్ పబ్లికేషన్ ట్రస్ట్ వారు సుమారు రూ.13 లక్షల విలువైన 3300 పుస్తకాలు విరాళంగా ఇవ్వడం జరిగిందని ,ఈ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం కళాశాలలో ఘనంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు.సుల్తాన్ చంద్ బుక్ ట్రస్ట్ వారు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇంత పెద్ద మొత్తంలో విలువైన పుస్తకాలను విరాళంగా అందజేయడం ఎంతో ఆనందకరమని, కళాశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. తమ కళాశాలలో అన్నీ కోర్సులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అదే విధంగా వివిధ పోటీ పరీక్షలకు కావలసిన అన్ని పుస్తకాలను విద్యార్థులకు పూర్తిగా అందుబాటులో ఉంచుతున్నామని, కళాశాలలోని లైబ్రరీ ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు తెరిచి ఉంటుందని, ఈ సదవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపినారు. తారా ప్రభుత్వ కళాశాలలోని లైబ్రరీ సకల సదుపాయాలతో అన్నివేళలా విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపినారు.



ఈ సందర్భంగా గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హానాక్ ఆర్థర్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ పుస్తకాల ద్వారా ప్రేరణ పొంది, తమ చదువులో ముందుకు సాగి, కనీసం కొంతమంది అయినా సివిల్ సర్వీసెస్, గ్రూప్ పరీక్షలు మరియు ఇతర పోటీ పరీక్షల్లో అగ్రస్థానాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకుని రావాలని తెలిపినారు.అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ అనిల్ కుమార్ విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచడంలో చూపిన నిబద్ధతను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఈ పుస్తకాలు కళాశాలకు అందించబడేలా సుల్తాన్ చంద్ పబ్లికేషన్స్‌తో సంప్రదింపులు ప్రారంభించి ముందడుగు వేసిన డాక్టర్ కరుణ కృషిని ప్రిన్సిపల్ ప్రత్యేకంగా ప్రశంసించారు.కార్యక్రమంలో జోగిపేట్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఎస్.ఎస్. రత్న ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బిచ్కుంద మండలంలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో భారీ చేరికలు




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 14సెప్టెంబర్: నిజామాబాద్ జిల్లా బిచ్కుంద మండలంలోని రాజాపూర్ గ్రామంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు, కార్యకర్తలు భారీగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు.ఈ రోజు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాజాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ వార్డు సభ్యులు గొట్టం సంజవ్, మేత్రి శోభా గంగాధర్‌తో పాటు చాకలి రాములు, గొట్టం గంగారం, విట్టల్, హనుమాన్లు, మేత్రి రామవ్వ, నేరేడు దామోదర్, సాకలి హనుమాన్లు, బాలకిష్టయ్య, లక్ష్మి తదితరులు కలిపి సుమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు.వారిని జహీరాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు బీబి పటేల్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణాతార, బీజేపీ బిచ్కుంద మండల పార్టీ అధ్యక్షులు శెట్పలి విష్ణు, రాజాపూర్ బూత్ అధ్యక్షులు చంద్రపాల్, జనరల్ సెక్రటరీ జాదవ్ పండరి, ముత్యం పిరాజీ, మాజీ మండలాధ్యక్షులు కిష్టారెడ్డి, మల్లికార్జున్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు అ'ధర'హో వర్జీనియా కిలో రూ.418



జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): వర్జీనియా పొగాకు ధరలు భారీగా పెరిగాయి. గత ఏడాది కిలో క్వాలిటీ పొగాకు ధర రూ.411 ఆల్ టైమ్ రికార్డు కాగా ప్రస్తుతం రూ.418 పలికింది. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం32లో కిలో పొగాకు ధర రూ.418, వేలం కేంద్రం 18లో రూ.417, కొయ్యల గూడెంలో రూ.418, గోపాలపురంలో రూ.416, దేవర పల్లిలో రూ.416 ?ధరలు పలికాయి. గత ఏడాది సంవత్సరం వారం రోజుల్లో వేలం ముగుస్తుందనగా రూ.411 ధర రాగా ఈ సంవత్సరం మరో 45 రోజులు వేలం సమయం ఉండగా ధర రూ.418 చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు క్వాలిటీ పొగా కును ఇప్పటికే రైతులు తక్కువ ధరకే అమ్ముకున్నారు. మిగిలిన క్వాలిటీ పొగాకు మాత్రమే అధిక ధరలకు అమ్ముకునే పరిస్థితులున్నాయి. రైతులు అదనంగా పండించిన పొగాకును ప్రస్తుతం ఎన్ఎల్ఎస్ పరిధిలో ఉన్న ఐదు వేలం కేంద్రాల్లో అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా పండించిన పొగాకును నామ మాత్రపు పెనాల్టీతో అమ్ముకునే వెసులుబాటు కల్పించ డం, ఇప్పుడు ధర పెరగడంతో రైతులు ముఖాల్లో సంతోషం కనబడుతుంది. ప్రస్తుతం ఉన్న రూ.418 ధర వేలం ముగిసే వరకు ఉంటుందా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే ధరలు నిలక డగా ఉంటే చాలా వరకు రైతులు తమ కష్టాల నుంచి బయట పడే అవకాశాలున్నాయి. అయితే లో గ్రేడు పొగాకు ధరలు రూ.200 మించి పెరగడం లేదు.

# తెనాలిలో డెంగీ



తెనాలి (గుంటూరు జిల్లా) : సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్):తెనాలిలో ఒక వ్యక్తికి డెంగీ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక 17వ వార్డు సాలిపేట ప్రాంతంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యారు. గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనకు రెండ్రోజుల క్రితం డెంగీ నిర్ధారణ అయినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలోని అలీఖాన్ వీధి, కావేటివారి వీధి, మసీదు ఎదురు సందు ప్రాంతాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వ ఏసుబాబు ఆధ్వర్యంలో మురుగు కాలువలలో పూడిక తీయించి, యాంటీ లార్వా స్ప్రే చేయించారు. బ్లీచింగ్ చల్లించారు. మలేరియా విభాగం సిబ్బందితో ప్రజల్లో అవగాహన కల్పించారు. మురుగునీటి పారుదలకు విఘాతం కలిగించవద్దని, వ్యర్థాలను కాలువల్లో వేయరాదని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు డి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, జి ప్రసాద్ టీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

# పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు




తెర్లాం, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): బాలికను వేధించి, అసభ్యకరమైన వ్యా ఖ్యలు చేసిన కేసులో కంకణాల కిరణ్‌కు విజయనగరం పోక్సో కోర్టు న్యాయాధి కారి కె.నాగమణి మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్ఐ సాగర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి చెం దిన ఓ బాలిక ఈ ఏడాది ఫిబ్రవరిలో చేసిన ఫిర్యాదుపై అప్పట్లో కంకణాల కిరణ్‌పై కేసు నమోదు చేశామన్నారు. కేసు విచారణ పూర్తికావడంతో కిరణ్‌కు న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారని ఎస్ఐ తెలిపారు. బాధితురాలికి రూ.25వేలు పరిహారం చెల్లింపునకు న్యాయాధికారి ఆదేశించారని ఎస్ఐ వివరించారు.

# 'అంగన్‌వాడీ' రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



ఒంగోలు సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): ఈ నెల 20, 21 తేదీల్లో ఒంగోలులో తొలిసారిగా జరగనున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ 11వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.జ మామహేశ్వరరావు కోరారు. ఒంగోలులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఐసిడిఎస్ ఏర్పడి 50 ఏళ్లు పూర్తై స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలోనూ ఆ రంగంలో పనిచేస్తోన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు ఉద్యోగ భద్రతకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో జరిగే మహాసభలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సభకు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని 27 జిల్లాలకు చెందిన వెయ్యి మంది నాయకులు పాల్గొంటారని, 21న జరిగే బహిరంగ సభను ప్రజాతంత్రవాదులు ఆర్థిక, హార్దిక సహకారం అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రమేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా మహాసభ వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.

# అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష



-కర్నూలు, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన బాలికను ముద్దాయి వివాహం చేసుకుంటానని నమ్మించి 2018 డిసెంబర్ 14న కిడ్నాప్ చేసిలైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో ముద్దాయి సాకే రాజకుమార్ అలియాస్ పెద్దకు 20 యేళ్ల జైలు శిక్ష రూ.2.5 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా పోక్సో కోర్టు జిల్లా న్యాయమూర్తి ఇ. రాజేంద్రబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. న్యాయస్థానం 20 మంది సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయిపై నేరం రుజువు కావటంతో జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో మిగతా నలుగురు ముద్దాయిలపై నేరం రుజువు కానందున వారిపై కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పోక్సో కోర్టు పిపి సి.వి శ్రీనివాసులు వాదించారు.

# అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



-ఉరవకొండ, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): అనంతపురం జిల్లా విడపనకల్లు మండల పరిధిలోని హావళిగి గ్రామంలో అప్పుల బాధతో వి లేపాక్షి (39) అనే యువరైతు ఆత్మహత్య చేసుకున్నారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు లేపాక్షి తనకున్న 2.7 ఎకరాల పొలంలో మిర్చి, వరి పంటలు సాగు చేసేవారు. ఐదేళ్లుగా సరైన దిగుబడి రాక, వచ్చినా కనీస మద్దతు ధరలు లేకపోవడంతో సాగు ఖర్చులు కూడా రాలేదు. దీంతో రూ.11 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురైన ఆయన ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. రైతు లేపాక్షి కుటుంబాన్ని సిపిఎం, కౌలు రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్ తదితరులు పరామర్శించారు. రూ.25 లక్షల పరిహారం అందజేసి రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# టమోటా ధర పతనం

## పత్తికొండ, ప్యాపిలి మార్కెట్లలో కిలో రూ.6కు మాత్రమే కొనుగోలు

## బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.25 నుంచి రూ.30 విక్రయం



కర్నూలు, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): టమోటా రైతుకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.25 నుంచి రూ.30 వరకూ ధర ఉండగా రైతుకు రూ.6 మాత్రమే లభిస్తోంది. దీంతో, వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల్లో రైతులు అధికంగా టమోటా సాగు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లోనే టమోటా క్రయవిక్రయాలు అత్యధికంగా సాగుతున్నాయి. పత్తికొండ నుండి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగుకు రూ.50 వేల వరకూ ఖర్చవుతోంది. ఒక ఎకరాలో ఏడు కోతల వరకూ పంట వస్తుంది. బాగా పంట పడితే కోతకు వెయ్యి కిలోల వరకూ దిగుబడి వస్తుంది. ఏడు కోతలకు కలిపి ఏడు వేల కిలోల వరకూ దిగుబడి వచ్చినా కిలో రూ.6 లెక్కన రైతుకు రూ.42 వేలు మాత్రమే దక్కుతుంది. ప్రస్తుత ధరను బట్టి రూ.8 వేల వరకూ నష్టం వస్తోంది. కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో కిలో రూ.20 వరకూ ధర ఉంది. ఇతర జిల్లాల్లో రూ.25 నుంచి రూ.30 వరకూ అమ్ముతున్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో శుక్రవారం గ్రేడ్-1 టమాటాకు గరిష్ఠ ధర రూ.210, కనిష్ఠ ధర రూ.170 వరకూ పలికింది. గ్రేడ్-2 టమాటాకు గరిష్ఠ ధర రూ.160, కనిష్ఠ ధర వంద రూపాయలు లభించింది. పత్తికొండ మార్కెట్లో నలుగురు వ్యాపారులు ఉన్నారు. వీరు సిండికేటై ధర తగ్గించేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శిస్తున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి టమోటా మార్కెట్‌లోనూ రైతుకు ధర దక్కడం లేదు. ఇక్కడ కూడా 25 కిలోల బాక్స్ రూ.150 మాత్రమే లభించింది. ఈ లెక్కన కిలో రూ.6 మాత్రమే పలికింది.

# వాటర్ బాటిల్ మూత మింగి బాలుడి మృతి





అనంతపురం సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): ఆడుకుంటూ పొర పాటున వాటర్ బాటిల్ మూత మింగి ఏడాదిన్నర చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. అనంతపురం నగరానికి చెందిన మౌనిక గుత్తి పట్టణ సమీపంలోని ఎన్‌పీటీసీ ట్రాన్స్‌కో విభాగంలో ఏఈఈగా విధులు నిర్వహి స్తున్నారు. ఆమె భర్త యుగంధర్ అనంతపురంలో ఆర్అండ్‌బీ ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి ఏడాదిన్నర వయసున్న కుమారుడు రక్షిత్ రామ్ ఉన్నారు. మౌనికకు నైట్ షిఫ్ట్ ఉండటం, కుమారుడు ఇంకా తల్లిపాలను మానకపోవడంతో వెంట తీసుకుని విధులకు వచ్చారు. వీరి వెంట ఆమె మామ కూడా ఉన్నారు. మౌనిక విధి నిర్వహణలో ఉన్న సమయంలో బాలుడు ఆడుకుంటూ పొరపాటున వాటర్ బాటిల్ మూత మింగేశాడు. అది గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరి అందక విలవిల్లాడాడు. మౌనిక వెంటనే బాలుడిని గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా సీటీఆర్ చేశారు. ఎంత ప్రయత్నించినా చిన్నారిని కాపాడటం సాధ్యం కాలేదని తెలిపారు. కన్న కొడుకు మృతితో మౌనిక గుండెలవిసేలా రోదించారు

# మలేరియా మాత్రలు మింగి..

కురుపాం సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): మలేరియా మాత్రలు మింగి ఓ గిరిజన మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఏగులవాడ పంచాయతీ ఈతమానుగూడలో రాత్రి జరిగింది. కురుపాం ఎస్ఐ నారాయణరావు అందించిన వివరాల ప్రకారం.. ఈతమానుగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ మండంగి సూరమ్మ(30), సురేష్ భార్యాభర్తలు. సురేష్ మద్యానికి బానిస కావడంతో భార్య సూరమ్మ తాగవద్దని మందలించింది. ఈ విషయంలో గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన సూరమ్మ ఇంటిలో ఉన్న 8 మలేరియా మాత్రలు మింగింది. దాంతో ఆమె అపస్మారక స్థితిలోకి చేరింది. సూరమ్మను మొండెంఖల్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూరమ్మ మృతి చెందింది. సూరమ్మకు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేశారు.

# సంపాదకీయం

## తగ్గింపులు సరే, క్షమాపణలు ఏవీ

కేంద్ర ప్రభుత్వానికి తుదకు వివేకోదయమయింది. ఈ సెప్టెంబర్ 3న ప్రభుత్వం విస్తృత శ్రేణి వస్తువులు, సేవలపై పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ %–%జీఎస్టీ) రేట్లను హేతుబద్ధీకరించి, తగ్గించింది. శుభం. జీఎస్టీ ఇప్పుడు 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్' భావన (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అనేకానేక పరోక్ష పన్నులను ఒకే ఒక పన్నుగా సమైక్యపరచడం)కు సన్నిహితంగా ఉన్నది, సందేహం లేదు. పలువురు రాజకీయవేత్తలు, ఎంతో మంది వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు, (నాతో సహా) వ్యక్తులు ఎందరో వస్తు సేవల పన్ను అనేది గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్ వలే ఉండాలని ఎనిమిదేళ్లుగా వాదిస్తూ వస్తున్నారు. %ఆగస్టు 2016లో రాజ్యాంగ (122వ సవరణ) బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు రాజ్యసభలో నేను ఆ చర్చలో పాల్గొన్నాను. ఆనాటి నా ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉటంకించడం అప్రస్తుతం కాదు. నేను ఇలా అన్నాను: "వస్తు సేవల పన్నును అమలుపరచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని తొలుత అధికారికంగా ప్రకటించింది డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని ఆర్థికమంత్రి అంగీకరించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. 28, ఫిబ్రవరి 2005న ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో జీఎస్టీని తొలిసారి ప్రకటించారు. వస్తుసేవల పన్నులో నాలుగు ప్రధాన అంశాలు ఉన్నాయి....."" "122వ రాజ్యాంగ సవరణ బిల్లులోని చాలా ముఖ్యమైన విషయాన్ని తరచి చూడదలుచుకున్నాను. మనం పరోక్ష పన్ను గురించి వ్యవహరిస్తున్నామన్న విషయాన్ని దయచేసి మరచిపోవద్దు. పరోక్ష పన్ను అనేది నిర్వచనం రీత్యా ఒక తిరోగామి పన్ను (పన్ను మొదట్లో చెల్లించేది ఒకడు. అంతిమంగా దాని భారాన్ని భరించేది మరొకడు అయినప్పుడు ఆ పన్నును పరోక్ష పన్ను అంటారు). ఏ పరోక్ష పన్ను అయినా ధనికులు, పేదలు ఒకే రీతిలో చెల్లించేదిగా ఉంటుంది.... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక ఇలా పేర్కొంది: 'అధికాదాయమున్న దేశాలలో సగటు జీఎస్టీ రేటు 16.8 శాతం. భారత్ లాంటి మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్న భారత్ లాంటి దేశాలలో సగటు జీఎస్టీ రేటు 14.1 శాతం'. ప్రపంచ వ్యాప్తంగా 190కు పైగా దేశాలలో జీఎస్టీ అనేది ఏదో ఒక రూపంలో ఉన్నది. అది సగటున 14.1 శాతం%–%16.8 శాతం మధ్య ఉన్నది...."" "పన్నురేట్లను మనం తక్కువగా ఉంచవలసిన అవసరమున్నది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను పరిరక్షించి తీరాలి... 'రెవెన్యూ తటస్థ రేటు' (రెవెన్యూ న్యూట్రల్ రేట్ %–% జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణ తరువాత ప్రభుత్వం సేకరించే మొత్తం పన్ను ఆదాయం మునుపటిలాగే ఉండేందుకు దోహదం చేసే ప్రామాణిక పన్ను రేటు)ను కనుగొనడం ద్వారా ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను కాపాడాలి... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో సహా ఆర్థిక నిపుణులతో సంప్రతింపులు, సమాలోచనలతో రెవెన్యూ తటస్థ రేటు 15 నుంచి 15.5 శాతంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. దరిమిలా ప్రామాణిక పన్నురేటు 18శాతంగా ఉండాలని సూచించారు. ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక నుంచి గ్రహించే కాంగ్రెస్ పార్టీ ఆ ప్రామాణిక పన్ను రేటు 18 శాతం ఉండాలని కోరిందని నేను మళ్లీ చెప్పుతున్నాను..."" "ప్రజల శ్రేయస్సు కోసం వారి తరఫున ఎవరో ఒకరు మాట్లాడాలి కదా. ప్రజల పేరిట నేను అడుగుతున్నాను: మీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సిఫారసు చేసిన రేటునే అమలుపరచండి. ప్రామాణిక పన్ను రేటు 18 శాతం మించకుండా చూడండి... ప్రామాణిక పన్ను రేటు 18 శాతంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పరిరక్షించబడతాయని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు తన నివేదికలో సుసంగతంగా వాదించారు. అది ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుంది. పన్ను చెల్లింపు ఎగవేతలను నివారిస్తుంది. దేశ ప్రజలందరికీ అంగీకారయోగ్యంగా ఉంటుంది. వస్తువులు, సేవలపై మీరు 24 నుంచి 26 శాతం పన్ను వసూలు చేయదలుచుకుంటే అసలు జీఎస్టీ బిల్లు తీసుకురావడమెందుకు?...."" "అంతిమంగా ఒక పన్ను బిల్లులో పన్నురేటు ఎంత అనేది స్పష్టంగా పేర్కొనాలి. 70 శాతానికి పైగా వస్తువులు, సేవలకు వర్తించే జీఎస్టీ రేటు ఎట్టి పరిస్థితులలోను 18 శాతానికి మించకూడదని మా పార్టీ తరఫున, నా తరఫున గట్టిగా, స్పష్టంగా కోరుతున్నాను. అలాగే తక్కువ జీఎస్టీ రేటు, డీ మెరిట్ రేటు (వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమైన, ప్రతికూల సామాజిక పరిణామాలకు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులు, చక్కెర పానీయాలు మొదలైన వాటి వాడకాన్ని నిరుత్సాహపరిచేందుకు సదరు సరుకులపై ప్రభుత్వం విధించే ప్రత్యేక పన్ను రేటు)ను ఆ 18 శాతం ప్రామాణిక రేటు ప్రాతిపదికన నిర్ణయించాలి".నేను ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలనే 2016లో రాజ్యసభ చర్చలో వ్యక్తం చేశాను. వస్తుసేవల పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని, తగ్గించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినందుకు నేను అమితంగా సంతోషిస్తున్నాను. అయితే వస్తుసేవల పన్నును అమలుపరచదలుచుకున్నప్పుడు ప్రామాణిక పన్నురేటు 18 శాతంగా మాత్రమే ఉంటే భారీ ఆదాయ నష్టం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సంభవిస్తుందని మోదీ ప్రభుత్వం వాదించింది. అది నిష్కారణ భయం మాత్రమే. ఆదాయ నష్టం సాకుతో పన్నురేట్లను అధికంగా నిర్ణయించారు. జీఎస్టీ తాజా సంస్కరణలో రెండు శ్లాబ్‌ల రేట్లు 5 శాతం, 18 శాతంగా ఉన్నాయి! పన్ను రాబడిని పెంచుకునేందుకు ప్రభుత్వానికి అనేక మార్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని కోల్పోతే, ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు సరైన మార్గం రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడమే.గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం వినియోగదారుల నుంచి చివరి పైసాను సైతం రాబట్టుకునేందుకు జీఎస్టీ రేట్లను బహుళ రీతుల్లో నిర్ణయించి అమలుపరిచింది. ఆదాయాన్ని మరింతగా పెంపొందించుకోవడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా ఉన్నది. వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017%–%మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలుచేసుకున్నది. 2024%–%25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? అది సబబైన ఎగతాళి సుమా! వినియోగం తగ్గిపోవడానికి, గృహ రుణాల (ఇళ్లు, వాహనాల కొనుగోలు మొదలైనవాటికి కుటుంబాలు చేసే రుణాలు) భారం పెరిగిపోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి జీఎస్టీ రేట్లు అధికంగా ఉండడమే.

# ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి

**పరిధి దాటితే చట్టపరంగా చర్యలు తప్పవు**

**ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులకు..ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు హెచ్చరిక**

**ఐఎంఏ ప్రతినిధులతో కలసి తురకపాలెం సందర్శన**




గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): ఆర్ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యులు అత్యవసర ప్రథమ చికిత్సలకే పరిమితం కావాలని.. పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డీ శ్రీహరిరావు హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఆశాకిరణ్‌తో కలసి శుక్రవారం ఆయన తురకపాలెంలో పర్యటించారు. గ్రామంలోని ఆర్ఎంపీ క్లినిక్‌లను సందర్శించారు. 'కలుషిత సెలైన్ కాటేసిందా..?' అనే శీర్షికన ప్రధాన సంచికలో ప్రచురితమైన వార్తాకథనానికి ఏపీ మెడికల్ కౌన్సిల్ స్పందించింది. తురకపాలెంలో ఆర్ఎంపీ క్లినిక్‌లను సందర్శించిన డాక్టర్ శ్రీహరిరావు వారు రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. పలు క్లినిక్‌ల్లో వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సిన స్టెరాయిడ్, యాంటీబయాటిక్స్ ఉండటాన్ని గుర్తించారు. అలాగే ఆర్ఎంపీలు తమ పేర్ల ముందు డాక్టర్ అని రాసుకోవడాన్ని కూడా ఆయన గమనించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు విలేకరులతో మాట్లాడుతూ... తురకపాలెంలో చనిపోయిన వారిలో చాలా మంది ఈ ప్ర?థమ చికిత్స కేంద్రంలో సెలైన్లు, యాంటీబయాటిక్స్ విచక్షణారహితంగా వాడినట్టు చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీలు సెలైన్లు పెట్టడం, యాంటీబయాటిక్ మందులు రాయడం, స్టెరాయిడ్లు ఇవ్వడం ప్రజారోగ్యానికి ఎంతో హానికరమన్నారు. నకిలీ వైద్యులు నిర్వహించే ప్రథమ చికిత్స కేంద్రాలకు వెళ్లడం ఎంత మాత్రం మంచిది కాదని సూచించారు. డాక్టర్ నందకిశోర్ మాట్లాడుతూ.. గ్రామీణులు తమ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే పీహెచ్‌సీల్లో చికిత్సలు పొందాలని సూచించారు. తురకపాలెంలో గుర్తించిన బ్యాక్టీరియా అంత ప్రమాదకరం కాదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తొలుత ఏపీ కౌన్సిల్, ఐఎంఏ ప్రతినిధులు గ్రామంలో ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు.

# పిడుగు పడితే హడల్..



**వాతావరణ మార్పులతో పెరుగుతున్న తీవ్రత**

**మొన్న ఆయిల్ ట్యాంకుపై.. నిన్న యుద్ధనౌక సమీపంలో**

**విశాఖ నగర పరిసరాల్లో పెరిగిన పిడుగులు**

**ఏప్రిల్–జూన్ మధ్య దేశంలో పిడుగుపాటుతో 1,621 మంది మృతి**

సెప్టెంబర్14 (సందేశం టైమ్స్): వానాకాలంలో పిడుగులు పడడం సహజం..! కానీ.. వాతావరణంలో మార్పుల ప్రభావంతో ఇటీవల పిడుగుల తీవ్రత పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కొద్దిరోజుల నుంచి విశాఖ నగర పరిసరాల్లో మేఘాలు ఏర్పడిన వెంటనే చెవులు చిల్లులు పడేలా పిడుగుల శబ్దం వినిపిస్తోంది. ఆదివారం పోర్టు ఏరియాలో ఈస్టిండియా కంపెనీ ఆయిల్ ట్యాంకుపై పిడుగు పడిన ఘటన కలకలం రేపింది. సోమవారం కూడా బంగాళాఖాతంలో యుద్ధనౌక సమీపంలో పిడుగు పడినట్టు వెదర్‌మ్యాన్ ఒకరు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. యుద్ధనౌకకు అతి సమీపం లో కళు మిరుమిట్లు గొలిపేలా మెరుపు మెరి స, ఆవెంటనే పిడుగు పడినట్టు పేర్కొన్నారు.నైరుతి రుతుపవనాల సీజన్‌లో పిడుగు లు సర్వసాధారణం. తుఫాన్‌ల సీజన్(అక్టోబరు, నవంబరు)లో కూడా పిడుగులు పడుతుంటాయి. మెరుపులను(లైట్నింగ్) ఆప్టికల్ గా, పిడుగు(థండర్)లను ఎలక్ట్రికల్‌గా పిలుస్తారు. భూమికి 750 మీటర్ల ఎత్తు నుంచి థండర్స్, లైట్నింగ్స్ సంభవిస్తుంటాయి. ఇవి మేఘాల నుంచి నేరుగా భూమిని తాకుతుంటాయి. ఆదివారం ఈస్టిండియా కంపెనీ ఆ యిల్ ట్యాంకుపై పడిన పిడుగు అత్యంత శ?క్తివంతమైనదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఇది 2 కిలోమీటర్ల దూరం నుంచి భూమిపైకి దూసుకురావడంతో ట్యాం కు పైకప్పు ఊడిపోయిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకూ దేశంలో పిడుగుల ధాటికి 1,621 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏప్రిల్ 10 నుంచి 12 వరకు మధ్య, తూర్పు భారతంలో 126 మంది(బిహార్‌లో 82 మంది, ఉత్తరప్రదేశ్‌లో 23 మంది) చనిపోయారు. పిడుగులు, మెరుపుల ధాటికి ఒడిశాలో ఎక్కువ మంది చనిపోతున్నారు. గత ఐదేళ్లలో ఈ రాష్ట్రంలో 1,625 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్క డ ఏటా ఆరు లక్షల మెరుపులు/ఉరుములు/పిడుగులు సంభవిస్తున్నాయి. బిహార్‌లో ఏటా సగటున 271 మంది చనిపోతుండగా.. 2020 జూన్ 25వ తేదీ ఒక్కరోజే 83 మంది పిడుగుల ధాటికి మృతిచెందారు. క్యుములోనింబస్ మేఘాల విచ్ఛిన్న సమయంలో కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు సంభవిస్తాయి. ఆ సమయంలో తీవ్రమైన విద్యుత్ ప్రవహించి, గాలి సంకోచ వ్యాకోచకాలకు లోనై శబ్దం పుడుతుంది. దానినే పిడుగు అంటాం. ముందు మెరుపు సంభవించిన తరువాత శబ్దం వస్తుంది. కొన్ని లక్షల వోల్టుల విద్యుత్ శక్తితో కూడిన పిడుగు భూమిని తాకినప్పుడు చెట్లు, భవనాలు ధ్వంసమవుతాయి. అదే మనుషులకు తాకితే మృత్యువాత పడతారు. పిడుగులు, ఉరుము లు, మెరుపులపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆయా రాష్ట్రాల్లో ముందస్తు సమాచారం అందిస్తోంది. ఆయా ప్రాంతాల్లో సెల్‌ఫోన్లకు విపత్తుల నిర్వహణ సంస్థ మెసేజ్‌లు పంపిస్తోంది. అయినా ప్రజల్లో అవగాహన కొరవడి పట్టించుకోవడం లేదు.

# 115 ఇంజనీర్ పోస్టులు ఖాళీ

**లస్కర్ల నియామకమూ వదిలేశారు**

**మరి నీటి యాజమాన్య నిర్వహణ ఎలా?**



అమరావతి,,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): లస్కర్ల నియామకాలకు జల వనరుల శాఖ దాదాపు చెక్ పెట్టేసింది. ఇంజనీరింగ్ అధికారుల పోస్టుల భర్తీని కూడా ప్రభుత్వం చేపట్టడం లేదు. వివిధ స్థాయుల్లో కలిపి మొత్తం 115 ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో నీటి యాజమాన్య నిర్వహణ ఎలా చేయగలమని జలవనరుల శాఖ అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ శాఖలో మూడు ఇంజనీర్–ఇన్–చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టులకు గాను రెంటింటిని మాత్రమే అడ్‌హాక్ పేరిట పదోన్నతి కల్పించి భర్తీచేశారు. మరో పోస్టు ఖాళీగా ఉంచేశారు. రాష్ట్రంలో 19 చీఫ్ ఇంజనీర్ పోస్టులకు గాను 13 పోస్టులకు అడ్‌హాక్ పదోన్నతులు ఇచ్చారు. ఇంకా 6 ఖాళీగా ఉన్నాయి. సూపరింటెండింగ్ ఇంజనీర్ పోస్టులు 51ఉంటే.. వాటిలో 16 ఖాళీ. అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు 267 ఉండగా.. ఏకంగా 92 ఖాళీగా ఉన్నాయి. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు ఇదే ఆటంకంగా మారింది. దిగువ స్థాయిలో అసిస్టెంట్.. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ, డీఈఈ) పోస్టులు 600 దాకా ఖాళీగా ఉన్నాయి. ప్రాజెక్టుల నిర్వహణలో అత్యంత ముఖ్యమైన లస్కర్ల నియామకాలూ జరగడం లేదు. కొన్ని ప్రాజెక్టుల్లో అవుట్ సోర్సింగ్ లో లస్కర్లను నియమించుకున్నట్లుగా ఖర్చు మాత్రమే చూపిస్తు న్నారన్న ఆరోపణలున్నాయి. లస్కర్లు లేకపోవడంతో పలు ప్రాజెక్టుల కాలువల్లోకి ఇంజనీర్లే స్వయంగా దిగి నీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చూడాల్సి వస్తోంది.

# ఇదేం గోల గోవిందా



సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): పవిత్ర భావనతో స్వామివారిని దర్శించుకునే భక్తులకు పట్టెడన్నం పెట్టి సేదతీర్చే తిరుమల కొండపై ఆకయితాల ఆగడాలు అదుపు తప్పాయి. ఉచిత భోజనం, వసతి దొరుకుతుండటంతో చాలామంది కొండపైనే తిష్ట వేశారు. వారు పగలు నామాలు పెట్టడం, దేవుని పటాలు, బొమ్మలు విక్రయిస్తూ గడుపుతున్నారు. అందరూ కాదుగానీ, వీరిలో కొందరు రాత్రి అయితే మద్యం తాగి కొండపై హల్‌చల్ చేస్తున్నారు. నిత్యం గోవింద నామస్మరణ జరిగే ప్రాంతం తిరుమల కొండ. అలాంటిచోట అక్కడ తరచూ ఘర్షణలు జరుగుతూ, మద్యంమత్తులో కొందరు కేకలు వేస్తూ రోడ్లమీద తిరుగుతుం డటం, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కొండ పవిత్రతకు అపచారం తెచ్చిపెట్టే ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. గత గురువారం రాత్రి మద్యం మత్తులో హేమకుమార్ అనే హాకరు మరో హాకర్ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి చీపురు కర్రతో దెబ్బలు తిన్నాడు. అంతేకాదు, గత ఐదారేళ్లలో కొందరు వ్యక్తులు మద్యం, మాంసం, గంజాయి విక్రయిస్తూ, పట్టుబడిన సందర్భాలున్నాయి. ఇలా అనధికార వ్యక్తులు క్షేత్ర పవిత్రత, ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. 'ఇదేం గోల గోవిందా' అంటూ భక్తులు వాపోయే పరిస్థితి వచ్చింది. తిరుమల కొండకు వస్తున్నవారిలో కొంతమంది అక్కడే ఏవో పనులు చూసుకుంటు న్నారు. సొంతూర్లలో అప్పులైపోయినా, ఏదైనా గొడవలైనా భక్తుల్లో కలిసిపోయి జీవించడానికి తిరుమల అనువుగా మారిపోయింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచీ చాలా మంది తిరుమల కొండెక్కేస్తున్నారు. ఎక్కినవారు తిరిగి దిగడం లేదు. హాకర్లుగా కొంతమంది, భవన కార్మికులుగా మరికొంతమంది కొండను అడ్డాగా మార్చుకున్నారు. వీరిలో కొంతమంది తరచూ ఆలయ నిబంధనలను భంగపరుస్తున్నారు. మాంసం తీసుకుంటూ, మద్యం తాగుతూ కొందరు హడావుడి చేస్తే,

# లైంగిక వేధింపుల కేసు.. తహసీల్దారుకు రిమాండ్



జగిత్యాల క్రైం,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ నాయక్‌కు లైంగిక వేధింపుల కేసులో జిల్లా మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రిమాండ్ విధించింది. జిల్లా కేంద్రంలోని అర్బన్ హౌజింగ్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించింది. పట్టణంలోని అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గాను వార్డుకో తహసీల్దార్ స్థాయి అధికారితో పాటు పలువురు మున్సిపల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా కలిసి పనిచేసిన ఓ మహిళా ఉద్యోగిపై తహసీల్దార్ రవీందర్ నాయక్ అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తహసీల్దార్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి జగిత్యాల మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.

# బ్యాంకులో 5 లక్షలు కాజేసిన బాలుడు!

**సీసీ కెమెరా ఫుటేజీతో నిర్ధారణ**
**నిజామాబాద్ జిల్లా బోధన్ ఎస్బీఐలో ఘటన.. చోరీపై పోలీసుల దర్యాప్తు**
**ఈ నెల 8న ఘటన ఆలస్యంగా వెలుగు చూసిన వైనం**

బోధన్,,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): నిజామాబాద్ జిల్లా బోధన్ లోని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్బీఐ)లో చోరీ జరిగింది. ఈ నెల 8న బ్యాంకులో రూ.5 లక్షలు చోరీకి గురైనట్లు క్యాషియర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో భాగంగా బ్యాంకులోని సీసీ కెమెరాల ఫుటేజీని చూసిన పోలీసులు విస్తుపోయారు. ఓ బాలుడు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. బ్యాంకులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగ్గా.. బాలుడు నగదు కౌంటర్ వైపు వెళ్లాడు. ఆ బాలుడే రూ.5 లక్షలు చోరీ చేసినట్లు నిర్ధారించామని పోలీసులు చెబుతున్నారు. అతనికి




సహకరించిన వారికోసం సీసీ ఫుటేజీల ద్వారా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పట్టణ సీఐని వివరణ కోరగా.. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

# రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్య

ఏఎసరావునగర్,సెప్టెంబర్ 14(సందేశం టైమ్స్): ఇద్దరూ ఒకరికొకరు తెలిసినవారే! కానీ.. వ్యాపార, ఆర్థిక లావాదేవీల్లో విభేదాల కారణంగా వారిలో ఒకరు మరొకరిని నడిరోడ్డుపై పొడిచి పొడిచి చంపాడు! హైదరాబాద్‌లోని కుషాయిగూడ హెచ్‌బీ కాలనీలో జరిగిందీ దారుణం. ఆ కాలనీకి చెందిన పి.శ్రీకాంత్‌రెడ్డి (45)... రియల్ ఎస్టేట్‌తోపాటు ఫైనాన్స్ వ్యాపారం కూడా చేసేవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిత్యం తన వెన్నంటి ఉండే ధన్‌రాజ్ (40) అనే వ్యక్తితో శ్రీకాంత్‌రెడ్డికి కొంతకాలంగా విభేదాలున్నాయి. అవి ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునే స్థాయికి చేరుకున్నాయి. ఆ విభేదాలను పరిష్కరించుకునేందుకు ఇద్దరూ మంగాపురంలోని శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయంలో కలుసుకుని.. మద్యం తాగారు. మత్తులో మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య బాగా గొడవ జరిగినట్టు సమాచారం. వాగ్వాదం కాస్తా కొట్టుకునేదాకా వెళ్లి ఇద్దరూ పెనుగులాడుతూ కార్యాలయంలోంచి బయటకు వచ్చారు.



ముందస్తు ప్రణాళిక ప్రకారం తనతో తెచ్చుకున్న కత్తిని బయటకు తీసిన ధన్‌రాజ్.. దాంతో శ్రీకాంత్‌రెడ్డిని విచక్షణరహితంగా పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డుకోబోయిన ఓ వ్యక్తిని సైతం బెదిరించాడు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి చనిపోయాడని భావించి అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డిని సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుషాయిగూడ పోలీసులు జరిగిన ఘటనపై ఆరా తీశారు. శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# 3 ఏళ్ల కూతుర్ని గొంతుపిసికి చంపిన తల్లి

శివ్వంపేట,,సెప్టెంబర్ 14(సందేశం టైమ్స్): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నకూతురిని ప్రియుడితో కలిసి గొంతుపిసికి చంపిందో తల్లి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాషపల్లిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శభాషపల్లికి చెందిన బంటు మమతకు రాయపోల్ మండలానికి చెందిన వడ్డేపల్లి భాస్కర్‌తో ఎనిమిదేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి చరణ్(4), తనుశ్రీ (3) పిల్లలు. భర్త భాస్కర్‌కు అర్థమయ్యేలా మాట్లాలేకపోవడం అనే బలహీనత ఉండటంతో దాన్ని సాకుగా చూపి.. అతడితో కలిసి ఉండలేనని, పెద్దలు తనకు ఇష్టం లేని పెళ్లి చేశారంటూ చెప్పి పిల్లలను తీసుకొని మమత అత్తింటి నుంచి శభాషపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. కొన్నాళ్లకు ఆమెకు అదే గ్రామానికి చెందిన ఫయాజ్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతడితో



వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న మమత ఈ ఏడాది జూన్ 7న కుమారుడిని తల్లి వద్దే వదిలేసి. తనుశ్రీని వెంటబెట్టుకొని ప్రియుడు ఫయాజ్‌తో కలిసి పుట్టింటి నుంచి బయటకొచ్చింది. అయితే గ్రామ శివారులో మమత, ఫయాజ్ కలిసి చిన్నారి తనుశ్రీని గొంతు పిసికి చంపి.. గొయ్యి తీసి పూడ్చిపెట్టి వెళ్లిపోయారు. గతంలోనూ ఇద్దరు కొన్ని రోజులు కనిపించకుండా పోవడంతో బంధువులు అప్పట్లోనే వెతికిపట్టుకుని వచ్చారు. ఈసారి వారి ఆచూకీ దొరక్కపోవడంతో భర్త భాస్కర్ మే 27న శివ్వంపేట పోలీసస్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు.

# రూ.12 వేల కోట్లు కాదు.. రూ.12 కోట్లే!

**హైదరాబాద్‌లో పట్టుకున్న డ్రగ్స్ ముడి పదార్థాల విషయంలో మహారాష్ట్ర పోలీసుల ప్రచారంపై రాష్ట్ర పోలీసుల అభ్యంతరం**



హైదరాబాద్,,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్):: మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌లో జరిపిన ఆపరేషన్‌పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చర్లపల్లిలో అక్రమంగా నడుస్తున్న రసాయన పరిశ్రమపై దాడిచేసి మాదకద్రవ్యాలను స్వాదీనం చేసుకోవడం అభినందనీయం అయినప్పటికీ.. పట్టుకున్న రసాయనాల విలువపై చేస్తున్న ప్రచారంపై తెలంగాణ పోలీసు, ఎక్సైజ్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముంబయి పోలీసులు పట్టుకున్న 5.790 కిలోల డ్రగ్ విలువ రూ.11.58 కోట్లు మాత్రమేనని మిగిలిన కెమికల్స్, ఇతర సామగ్రి విలువ కలిపినా మొత్తం రూ.12 కోట్లకు మించదని రాష్ట్ర నిఘా వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఈ ముడి పదార్థాలతో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ తయారు చేయవచ్చుంటూ ముంబయి పోలీసులు చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారింది. దీనిపై తెలంగాణ ఇంటెలిజెన్స్, ఎక్సైజ్‌శాఖ అధికారులు విచారణ చేపట్టారు. కాగా.. చర్లపల్లిలో నిర్వహిస్తున్న ఆ డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీకి ఎలాంటి అనుమతులూ లేవని తేలింది. నాచారంలో 2017లో ఒక ఫ్యాక్టరీ కోసం దువ్వూరి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి అనుమతి తీసుకున్నా.. అది ప్రారంభం కాకుండానే యాజమాన్యం ఓలేటి అజయ్, శ్రీనివాస్ అనే వ్యక్తుల పేరు మీదకు మారింది. వీరు నాచారం బదులు చర్లపల్లిలో అక్రమంగా ఈ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.ముంబై పోలీసులు డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసిన వెంటనే మంత్రి జూపల్లి కృష్ణారావు ఎక్సైజ్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి.. . "వారు ఇక్కడికి వచ్చి దాడులు చేసేదాకా మీరెందుకు గుర్తించలేకపోయార"ని మంత్రి ప్రశ్నించినట్లు తెలిసింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించే అంశంపైనా మంత్రి వారితో చర్చించారు. అయితే.. అలా చేయడంవల్ల పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేసినట్లు అవుతుందనే అభిప్రాయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

# కారైనా.. బైకైనా.. లారీ అయినా.. ఇకపై ఇది ఉండాల్సిందే..

**ప్రమాదాల నివారణకు రవాణా శాఖ కీలక నిర్ణయం**
**వాహనం, దాని మూలలు కనిపించేలా స్టిక్కర్ ఉండాలి**
**రాత్రిపూట వాహనాలు స్పష్టంగా కనిపించడానికే నిబంధన**
**అధీకృత సంస్థ నుంచే స్టిక్కర్లు కొనాలని ఉత్తర్వుల్లో ఆదేశం**

సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్)::ఇటీవలి కాలంలో ఇటువంటి వార్తలు ఎక్కువయ్యాయి! రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లేదా నెమ్మదిగా వెళుతున్న వాహనం దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో జరిగే ప్రమాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ద్విచక్ర వాహనాలు కావచ్చు.. సరుకు రవాణా చేసే భారీ వాహనాలు కావచ్చు.. అన్నిటికీ వెనక రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లను అతికించడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి వేళల్లో ముందు వెళ్లే వాహనాలు స్పష్టంగా కనిపించడమే ధ్యేయంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదాలనివారణ చర్యల్లో భాగంగా నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాలనూ పక్కాగా అమలు చేయనున్నామన్నారు. రిఫ్లెక్టింగ్ స్టిక్కర్ల వాడకాన్ని తప్పనిసరిగా అమలు చేసేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని,రాత్రి వేళ వాహనం, దాని మూలలు స్పష్టంగా కనిపించేలా ఈ స్టిక్కర్ ఉండాలని వివరించారు. రిఫ్లెక్టర్ల పరిశీలనకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా



కమిటీ ఏర్పాటు చేసేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న వాహనాల వెనక స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నారని, పాత వాహనాలు తప్పనిసరిగా స్టిక్కర్‌ను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, సరుకు రవాణా వాహనాలు, మోటారు క్యాబ్‌లు, ఆటోలు, ఓమ్నీ బస్సులు, హైడ్రాలిక్ ట్రాలర్లు తదితర అన్ని వాహనాలకు వెనక భాగంలో ఇకపై రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు తప్పనిసరి చేశారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు, నంబరు ప్లేట్లు ఏఐఎస్ 057, 090, 089 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, వీటిని తనిఖీ చేయడానికి క్యూఆర్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, రవాణా శాఖ అధీకృత సంస్థలు మాత్రమే వీటిని సరఫరా చేయాలని ఉత్తర్వుల్లో నిర్దేశించారు. వాహన యజమానులందరూ ఈ నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# సినీఫక్కీలో దారిదోపిడీ.. 40 లక్షలు చోరీ



శంకర్‌పల్లి,,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): పట్టపగలు.. నలుగురు దుండగులు సినీఫక్కీలో దారి దోపిడీకి పాల్పడి రూ.40 లక్షలు దోచుకున్నారు! అనంతరం అక్కణ్నుంచీ పారిపోయే క్రమంలో వారి కారు బోల్తాపడింది. లోపలున్న నలుగురు దుండగులూ పరారయ్యారు. రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలంలో జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన రాకేశ్ అగర్వాల్ స్టీల్ వ్యాపారి. వికారాబాద్‌లో ఉన్న తన కస్టమర్ వద్ద నుంచి రూ.40 లక్షలు తీసుకురావాలం టూ.. ఆయన తన డ్రైవర్ మధును, నమ్మకస్తుడైన సాయిబాబా అనే మరో వ్యక్తిని ఉదయం కారులో పంపించాడు. వారిద్దరూ వికారాబాద్‌లో కస్టమర్ ఇచ్చిన సొమ్ముతో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే.. నలుగురు దుండగులు మరో కారులో (టీఎస్ 11 ఈఎల్ 8817) వారిని వెంబడించారు. మధ్యాహ్నం 1:30గంటల సమయం లో శంకర్‌పల్లి మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ గ్రామ శివారులోకి రాగానే.. మధు, సాయిబాబా ఉన్న కారు ను వెనుక నుంచి ఢీకొట్టారు. వారి కారు ఆగగానే.. ముగ్గురు వ్యక్తులు ముఖాలకు మాస్క్ ధరించి వచ్చి డ్రైవర్ మధు కళ్లలో కారం చల్లి, వెనుక వైపు కారు అద్దం పగలగొట్టి.. లోపల కూర్చున్న సాయిబాబాపై దాడి చేశారు. డమ్మీ పిస్తోల్‌తో బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.40 లక్షల నగదు సంచిని లాక్కుని తమ కారులో అక్కణ్నుంచి వెళ్లిపోయారు. కానీ.. నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత కొత్తపల్లి గ్రామంలోకి రాగానే దుండగుల కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తాపడింది. వెంటనే దుండగులు కారులో నుంచి బయటకు వచ్చి.. కారును అక్కడే వదిలి రూ.40 లక్షల డబ్బు ఉన్న బ్యాగ్ తీసుకొని అక్కణ్నుంచీ వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. కారు బోల్తాపడిన శబ్దం విని అక్కడికి చేరుకున్న స్థానికులు ఏమైందని అడగ్గా.. తమపై ఎవరో దాడి చేసేందుకు వెంటపడుతున్నారని చెబుతూ అక్కడి నుంచి దుండగులు పారిపోయారు. వారి తీరుతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని కారును పరిశీలించగా.. అందులో రూ.8.71 లక్షల నగదు, డమ్మీ పిస్తోలు, కత్తి, కారంపొడిం, మద్యం బాటిల్ లభ్యం అయ్యాయి. కాగా.. దారి దోపిడీ గురించి తె లుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి, చేవెళ్ల ఏసీపీలు రమణగౌడ్, కిషన్‌గౌడ్‌లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

# కూకట్‌పల్లి రేణు మర్డర్ కేసును మలుపు తిప్పిన క్యాబ్ డ్రైవర్.

హైదరాబాద్,,సెప్టెంబర్ 14 (సందేశం టైమ్స్): కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ హత్య కేసును హైదరాబాద్ పోలీసులు ఛేదించారు. రేణు అగర్వాల్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు పోలీసులు. ఢిల్లీలో నిఖిల్‌ను పట్టుకున్నారు పోలీసులు.రాంచీలో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. రేణు అగర్వాల్ హత్యకు ముందు తూప్రాన్‌లో మందు పార్టీ చేసుకున్నారు హర్ష గ్యాంగ్. పార్టీలో మొత్తం తొమ్మిది మందిని గుర్తించారు హైదరాబాద్ పోలీసులు. క్యాబ్ డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.కాగా, కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో రాకేష్, రేణు అగర్వాల్ దంపతులు నివసిస్తున్నారు. జార?ండ్‌కు చెందిన హర్ష వారి ఇంట్లో పనిచేస్తున్నారు. హర్ష తన గ్యాంగుతో రేణు అగర్వాల్‌ను బుధవారం మధ్యాహ్నం హత్య చేశారు. మొదట రాకేష్ ఇంట్లోకి వెళ్లిన ఇద్దరూ.. ఒంటరిగా ఉన్న రేణు అగర్వాల్ నోట్లో దుస్తులు కుక్కి కాళ్లు చేతులు కట్టేశారు. లాకర్ తాళాలు ఎక్కడున్నాయో చెప్పాలని, ఎక్కడెక్కడ డబ్బు, బంగారం ఉందో చెప్పాలని చిత్రహింసలు పెట్టారు. సుమారు గంటకుపైగా ఆమెను చిత్రహంసలు పెట్టినా నోరు విప్పకపోవడంతో ఆగ్రహానికి గురైన దుండగులు కుక్కర్‌తో రేణు అగర్వాల్ తలపై బలంగా కొట్టారు. ఆపై ఆమెను కత్తితో గొంతుకోసి విచక్షణా రహితంగా పొడిచి చంపేశారు. అనంతరం ఇంట్లోనే స్నానం చేసి, ట్రావెల్ బ్యాగుతో పారిపోయారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా విచారిస్తున్నారు.





# క్రీడావార్తలు



## అర్ష్‌దీప్‌ను అందుకే తీసుకోలేదు..
## తొలిసారి స్పందించిన బ్యాటింగ్ కోచ్..




ఆసియా కప్-2025 లో భాగంగా యూఏఈతో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా బౌలింగ్ లైనప్ చాలా మందిని ఆశ్చర్యపరిచింది. అందరూ అనుకున్నట్టుగా అర్ష్‌దీప్ ను తుది జట్టులోకి తీసుకోలేదు. కేవలం ఒకే ఒక పేసర్‌తో టీమిండియా బరిలోకి దిగింది. జస్ప్రీత్ బుమ్రాతో పాటు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలను ఫాస్ట్ బౌలింగ్ కోసం వాడుకుంది. ఏకంగా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగి అందరికీ షాకిచ్చింది తుది జట్టు కూర్పుపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ స్పందించారు. 'తుది జట్టు ఎంపిక విషయంలో ఎటువంటి ఎజెండా లేదు. జట్టుకు ఏది అవసరం అనే దానిని దృష్టిలో ఉంచుకుని తుది జట్టు ఎంపిక జరుగుతుంది. జట్టుకు ఏది మంచిదో కెప్టెన్, ప్రధాన కోచ్ నిర్ణయించుకుంటారు. జట్టులో ఉన్న 15 మంది మైదానంలోకి దిగడానికి అర్హులే. కానీ, అందరికీ చోటు దొరకదు. పిచ్ పరిస్థితి, ప్రత్యర్థి జట్టును బట్టి తుది జట్టు ఎంపిక ఉంటుంది. ఆ పిచ్ మీద స్పిన్నర్లకు మద్దతు లభిస్తుందని అనుకున్నాం. అందుకే అర్ష్‌దీప్‌ను తీసుకోలేదు' అని సితాన్షు చెప్పారు %అలాగే, సంజూ శాంసన్ బ్యాటింగ్ ఆర్డర్ గురించి కూడా సితాన్షు స్పందించారు . 'సంజు 5 లేదా 6వ స్థానంలో పెద్దగా బ్యాటింగ్ చేయలేదు. దాని అర్థం అతడు ఆయా స్థానాల్లో బ్యాటింగ్ చేయలేడని కాదు. సంజు ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగల మంచి ఆటగాడు. జట్టు అవసరాల దృష్ట్యా కెప్టెన్, ప్రధాన కోచ్ నిర్ణయం ప్రకారం ఏ నంబర్‌లోనైనా బ్యాటింగ్ చేయడానికి సంజు సిద్ధంగా ఉన్నాడు' అని సితాన్షు పేర్కొన్నారు.

## సెమీస్‌లో మీనాక్షి ఫ ప్రపంచ బాక్సింగ్




లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్సులో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హూడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝుర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

## స్టార్లతో కళకళ నేటి భారత షెడ్యూల్




టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హెూరాహెూరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్సులో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్సులో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు ఆర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్సులో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్టేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

## తొలిరోజు మనదే



బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హుస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

## సెమీసలో సాత్విక్ జోడీ



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హెూరాహెూరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిపలో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

## పాక్ శుభారంభం



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియాకప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హరీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.సంక్షిప్త స్కోర్లు పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హరీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23బీ కలీమ్ 3/31, ఫైజల్ 3/34).ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27బీ ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

## ఇక దయచేయండి విరుష్కతో కివీస్ హెూటల్ సిబ్బంది



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హెూటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీసలో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హెూటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హెూటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

# బిజినెస్



## ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎసగా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎసకి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది. పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎసఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో




పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది. రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది. ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది. రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలినియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫలకు ఊరట రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

## బంగారం ధరకు రెక్కలు.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం కొనాలనుకునే వారికి షాక్. బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్ 13న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 11, 290కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 02, 010కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 11, 440కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 02, 160కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 11, 290కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 02, 010కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్




: వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప జేఎసీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్సను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

## అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయి లో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెన్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫసీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫసీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి




నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు. గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది.

## జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్

జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. కూకట్‌పల్లిలో రెండో షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, వివేకానంద నగర్ కాలనీ కార్పొరేటర్ రోజా దేవీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆటోంనీ జోస్, థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ




జార్జ్, రిటైల్ హెడ్ రాజేశ్ కృష్ణన్, మార్కెటింగ్ హెడ్ అనీష్ వర్గీస్, రీజినల్ మేనేజర్ సునీల్ పీఎస్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006